క్లుప్తంగా

అపోలోలో అరుదైన ఆర్థోపెడిక్ సర్జరీ



వ్యక్తికి ఆర్థోపెడిక్ సర్జరీ చేస్తున్న డాక్టర్ ఖాన్

ఆరిలోవ: అపోలో ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు డాక్టర్ అబ్దుల్ డి.ఖాన్ ఓ వ్యక్తికి అరుదైన శస్త్ర చికిత్స చేశారు. ఈ మేరకు ఆయన గురువారం శస్త్ర చికిత్స వివరాలను విలేకరులకు తెలియజేశారు. నగరానికి చెందిన 30 సంవత్సరాల వ్యక్తి సుమారు ఆరు నెలల నుంచి భుజం నొప్పి, బలహీనతతో బాధపడుతున్నాడు. ఇటీవల అపోలో ఆస్పత్రికి వచ్చిన రోగికి ఎంఆర్ఐ స్కానింగ్ చేయగా.. రొటేటర్ కఫ్ చీలికతో బాధపడుతున్నట్లు గుర్తించారు. ఆ చీలికకు రిపేర్ చేసిన అనంతరం బయో ఇండక్టివ్ రీజెనెటెన్ ఇంప్లాంట్ చేశారు. ఈ సర్జరీ తర్వాత రోగిని 24 గంటల్లో డిశ్చార్జి చేసినట్లు ఖాన్ తెలిపారు. ఇది సులువైన పద్ధతి అని, దీని ద్వారా నొప్పి ఉండదని వివరించారు. ఈ విధానంలో శస్త్ర చికిత్స చేయడం రాష్ట్రంలోనే మొదటిసారని డాక్టర్ ఖాన్ తెలిపారు.

విధి నిర్వహణలో భద్రత తప్పనిసరి



మాట్లాడుతున్న సివిల్ జడ్జి వెంకట శేషమ్మ

మల్కాపురం : విధుల నిర్వహణలో ప్రతి కార్మికుడు భద్రత పాటించాలని సివిల్ జడ్జి, డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి ఎం. వెంకట శేషమ్మ అన్నారు. హెచ్‌పీసీఎల్‌లో గురువారం జరిగిన భద్రత అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రిటైర్డ్ జిల్లా జడ్జి, పర్మినెంట్ అదాలత్ పబ్లిక్ యుటిలిటీ సర్వీస్ చైర్మన్ వల్లభనాయుడు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సురేష్ వాడుపల్లి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సుధాకర్, హెచ్‌పీసీఎల్ ఈడీ రామకృష్ణన్ తదితరులు కార్మికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. సదస్సులో కార్మికులు, అధికారులు పాల్గొన్నారు.

అప్పన్నకు బంగారు కాసుల హారం బహూకరణ

సింహాచలం : సింహాచలం నృసింహ స్వామికి గురువారం మధురవాడకు చెందిన మేడపాటి నరసింహా వరహాలరెడ్డి 15 గ్రాముల బంగారు కాసుల హారం, 750 గ్రాముల వెండి అష్టలక్ష్మి కలశ బహూకరించారు. వీటిని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తికి అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాన్ని అధికారులు అందజేశారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ వెంకటరమణ పాల్గొన్నారు.

జార్జి ఫెర్నాండేజ్‌కు ఏయూ డాక్టరేట్



జార్జి ఫెర్నాండేజ్‌కు ఉత్తర్వుల కాపీని అందిస్తున్న ఆచార్య చల్లా రామకృష్ణ

ఎంవీపీ కాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగ పరిశోధక విద్యార్థి భూపతి జార్జి ఫెర్నాండేజ్‌కు డాక్టరేట్ లభించింది. విభాగం ఆచార్యుడు చల్లా రామకృష్ణ పర్యవేక్షణలో సమాచార హక్కు చట్టం–పత్రికల పాత్ర–మీడియా ప్రచురించిన కథనాలు అంశంపై ఫెర్నాండేజ్ పరిశోధన చేశారు. ఈ మేరకు చల్లా రామకృష్ణ నుంచి ఆయన డాక్టరేట్ ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఫెర్నాండేజ్‌ను వీసీ ఆచార్య శశిభూషణ్‌రావు, జర్నలిజం విభాగ ఆచార్యులు, పరిశోధకులు అభినందించారు.

సీజనల్ వ్యాధులపై యుద్ధం



ఇంటి సర్వే నిర్వహిస్తున్న ఆశాకార్యకర్తలు



వాటర్ ట్యాంకుల్లో ఆయిల్ బాల్స్ విడుదల చేస్తున్న సిబ్బంది



ఆస్పత్రులు, పాఠశాలల గోడలపై ఏసీఎం పిచికారీ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జోన్–3 అధికారులు

- ముందస్తు చర్యలు చేపట్టిన జోన్–3 అధికారులు
- ఏఎన్‌ఎంలతో ఇంటింటి సర్వే, అవగాహన

ఎంవీపీ కాలనీ: సీజనల్ వ్యాధుల నివారణపై జీవీఎంసీ ఆరోగ్య శాఖ విభాగం అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాలతో జోన్–3 ఆరోగ్య, మలేరియా విభాగ ఉద్యోగులు అప్రమత్తమయ్యారు. రుతు పవనాలు విస్తరణ కారణంగా వర్షాలు అధికమవుతున్న నేపథ్యంలో వార్డుల్లో సీజనల్ వ్యాధులపై ఇంటింటి ప్రచారంతో పాటు అవగాహన కార్యక్రమాలు, సర్వేలు ముమ్మరం చేశారు. బలహీనత, జర్వం వంటి లక్షణాలు ఉంటే తక్షణమే సమాచారం అందించాలని సర్వేలో ఆశా కార్యకర్తలు ప్రజలకు సూచిస్తున్నారు. ఇంటి ఆవరణాలు, నీటి తొట్టెల పరిశుభ్రతపై సూచనలు చేస్తున్నారు.

ఆ మూడు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

గత నెలలో జోన్–3 పరిధిలో రెండు డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. 19వ వార్డు జాలరిపేటలో ఒకటి, 28 వార్డు రేసవానిపాలెంలో మరో డెంగ్యూ కేసు నమోదైనట్లు జోన్–3 హెల్త్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. దీంతో జోన్–3 పరిధిలోని అన్ని వార్డుల్లోనూ సీజనల్ వ్యాధులపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పెద జాలరిపేట, సీతంపేట, దొండపర్తి ప్రాంతాలను హైరిస్క్‌గా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో వ్యాధుల నివారణకు ప్రత్యేక కార్యచరణ అమలు చేస్తున్నారు.

ఈ నెల ఒకటో తేదీన ప్రారంభమైన డెంగ్యూ నివారణ మాసోత్సవాలు 31వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఇందులో భాగంగా ఆరోగ్య శాఖ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, స్థానిక హెల్త్ సెక్రటరీలు సంయుక్తంగా అవగాహన ర్యాలీలు, శిబిరాలు నిర్వహిస్తున్నారు. దీంతో పాటు మలేరియా విభాగం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని విస్తృతం చేసింది. నిల్వ నీటిని పారబోయడం, ఇంటి ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి అంశాలపై అవగాహనతో పాటు మురికివాడల్లో పర్యటించి అప్రమత్తం చేస్తున్నారు.

విస్తృతంగా అవగాహన

మలేరియా, డెంగ్యూ, డయేరియా కేసుల నివారణే లక్ష్యంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలను అప్రమత్తం చేశాం. ఇంటింటి అవగాహన, నిల్వ నీటి ట్యాంకులు, పాత బోర్లు, లిఫ్ట్ గోతులు ఇలా చాలా చోట్ల ఆయిల్ బాల్స్ విడుదల, స్కూల్స్, ఆస్పత్రుల్లో గోడలపై ఏసీఎం రసాయాన్ని పిచికారీ చేస్తున్నాం. దీని వల్ల 3 నెలల పాటు ఆ గోడలపై దోమలు వాలవు. హైరిస్క్ ప్రాంతాలుగా ఉన్న పెద జాలరిపేట, సీతంపేట, దొండపర్తిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. అదనపు సిబ్బందితో పాటు పూర్తి స్థాయిలో ఓ సూపర్‌వైజర్‌ను అందుబాటులో ఉంచాం. ఈ ప్రాంతంలో జీరో కేసుల లక్ష్యంగా ప్రణాళికలు అమలు చేస్తున్నాం.

– బి.శ్రీనివాస్, మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్, జీవీఎంసీ జోన్–3

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం దుర్గానగర్ ఫీడర్‌లో మరమ్మతులు చేపట్టనున్న దృష్ట్యా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. 33/11 కేవీ పైనాపిల్ కాలనీ ఎస్ఎస్‌లో ఉన్న దీని పరిధిలో విద్యుత్ నిర్వహణ పనులు చేపట్టనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాండురంగాపురం, నెహ్రూనగర్, దుర్గాబజార్, లక్ష్మీనగర్, ఎర్నిదుర్గానగర్, పోలీస్ స్టేషన్ ప్రాంతం, శివాజీనగర్, ప్రగతినగర్ ప్రాంతాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని, ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

మద్దిలపాలెం ఫీడర్ పరిధిలో..

మద్దిలపాలెం: ఏపీ ఈపీడీసీఎల్ జోన్–1లోని మద్దిలపాలెం మెయిన్ రోడ్డు ఫీడర్ పరిధిలో నిర్వహణ పనులు కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్–1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ మద్దిలపాలెం, భానునగర్, కృష్ణా కళాశాల ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఆయన పేర్కొన్నారు.

యాజమాన్యంపై చర్యలు కోరుతూ కార్మికుల నిరసన




కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

మహారాణిపేట : తమను వేధిస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న సెంట్రల్ ఫార్మశీలో పని చేస్తున్న కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. తమ సర్టిఫికెట్లు, బాండ్లు తిరిగి ఇప్పించాలని కోరుతూ గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. సెంట్రల్ ఫార్మశీలో ఉద్యోగం కోసం జాబ్ మేళా ద్వారా మూడేళ్ల కాలపరిమితితో విధుల్లోకి తీసుకున్నారని, ఆరు నెలల పాటు శిక్షణ ఇచ్చి ఆ తర్వాత ఉద్యోగం ఇస్తామని చెప్పారన్నారు. విధుల్లో చేరే సమయంలో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకున్నారని, అలాగే ఖాళీ బాండ్ పేపర్ల మీద సంతకాలు తీసుకుని ఉంచుకున్నారని తెలిపారు. వాటిపై ఏం రాశారో తమకు చూపించలేదని, విధుల్లో చేరిన నాటి నుంచి ఎన్నో రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని కార్మికులు వాపోయారు. 8 గంటల పని నిబంధన పాటించలేదని, తమ చేత 12 నుంచి 14 గంటలు పని చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదనపు పని గంటలకు ఓటీ ఇస్తామని చెప్పి ఇప్పుడు అమలు చేయడం లేదని, ఇతర సౌకర్యాలేవీ కల్పించలేదని తెలిపారు. యాజమాన్యంలోని ఒక వ్యక్తి లైంగిక దాడులకు పాల్పడుతున్నారని మహిళా కార్మికులు వాపోయారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలి

- పారదర్శకంగా సమస్యలు పరిష్కరించాలి
- పోలీసులకు సీపీ శంఖబ్రత బాగ్చి సూచన



పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

పెందుర్తి: సమస్యల పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. ఫిర్యాదులతో వచ్చిన ఇరు పక్షాల వాదనలు విని..తగిన విచారణ చేసి సమస్య పరిష్కరించాలన్నారు. గురువారం పెందుర్తి పోలీస్ స్టేషన్‌ను సీపీ ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఖాళీ స్థలాల్లో వ్యర్థాలను వేయకుండా అక్కడ మొక్కలు నాటాలన్నారు. సిబ్బంది ఎవరు ఏ విధులు నిర్వర్తిస్తున్నారో ప్రజలకు తెలిసే విధంగా నేమ్ బోర్డులు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. స్టేషన్‌లో సిబ్బంది నిర్ణీత సమయానికి..పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని..పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. రిజిస్టర్లు రోజువారీ అప్డేట్ ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. సిబ్బందికి ఏ సమస్యలు ఉన్నా చెప్పాలన్నారు. సిబ్బందికి కుటుంబ పరంగా, వృత్తి పరంగా ఏ సమస్య ఉన్నా 79950 95799 నంబర్‌కు తెలియజేయాలన్నారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు పాడవకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆ విభాగం అధికారులకు ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టే విధంగా ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కదలికలను నిశితంగా పరిశీలించాలన్నారు. గంజాయి రవాణాపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. అవసరమైన ప్రతీ చోట సీసీ కెమెరాల ఏర్పాటు తప్పసరిగా చేయాలని ఆదేశించారు. విధుల నిర్వాహణలో ఎవరు బాధ్యతారహితంగా వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. ఎస్ఐలు అసిరి తాత, నరసింహరాజు సిబ్బంది పాల్గొన్నారు.

‘ఉక్కు’ను ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాల్సిందే..

అగనంపూడి: విశాఖ ఉక్కు ప్రజల సొత్తని, దానిపై రాష్ట్ర ప్రజలకు పూర్తి హక్కు ఉందని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. కాదని, మొండిగా ముందుకు వెళ్లి ప్రైవేటీకరణ చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ యత్నాలకు నిరసనగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే దీక్షల్లో 1260వ రోజు ఆయన మాట్లాడారు. మూడోసారి అత్తెసరు మెజార్టీతో అధికారంలోకి వచ్చినా మోదీ, అమిత్‌షా ఆలోచనా ధోరణిని మార్చుకోలేదని మండిపడ్డారు. లక్షల కోట్ల విలువైన ప్రజాధనాన్ని లూటీ చేసి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టాలనుకుంటున్న కేంద్ర ప్రభుత్వం అదే ధోరణితో ముందుకువెళ్తే ప్రజల ఛీత్కారాలు తప్పవన్నారు. ఉక్కును సెయిల్‌లో విలీనం చేయడం తప్ప వేరే మార్గం ఏదీ సరికాదన్నారు. కార్యక్రమంలో కసిరెడ్డి సత్యనారాయణ, వరసాల శ్రీనివాసరావు, దాసరి శ్రీనివాస్, కె.శ్రీనివాసులు నాయుడు, ఏఐటీయూసీ నాయకులు కిడిమి రాజబాబు, ఎ.మసేనురావు, డొక్కా నరసింగరావు, నరేష్‌కుమార్, జి.జయ, తాండ్ర కనకరాజు, డి.దేముడు, గుమ్మడి నరేంద కుమార్, శివరామకృష్ణ, మురళీకృష్ణ, జ్యోతి ప్రసాద్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూముల పరిశీలన

తగరపువలస : ఆనందపురం మండలం గంభీరం , కుసులవాడ, ఎన్‌జీఆర్‌పురం గ్రామాల్లో భీమిలి ఇన్‌చార్జి ఆర్డీవో హుస్సేన్ గురువారం పర్యటించారు. ఎన్‌జీఆర్ పురం రెవెన్యూ గ్రామంలో గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. అలాగే గంభీరంలో సర్వే నంబర్ 149కు సంబంధించి వెబ్ ల్యాండ్‌లో ప్లాట్ యజమానులు దరఖాస్తు చేసుకున్న స్థలాలను పరిశీలించారు. అనంతరం కుసులవాడలోని వివాదాస్పద భూములను పరిశీలించారు. ఆయనవెంట తహసీల్దార్ హేమంత్‌కుమార్, సర్వేయర్లు రాజేష్, దేవి, నరేష్, రోహిత్, వీఆర్వో దేవరాజ్ తదితరులు ఉన్నారు.

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: స్టీల్‌సిటీ ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్ల రెండో విడత భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఐటీఐ ప్రిన్సిపాల్ కె శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 24లోగా iti.gov.in పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న కాపీ, ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్ చేయించుకున్న అభ్యర్థులు ఐటీఐలో ప్రవేశం కోసం ఈ నెల 27న ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలపై ఆరా తీస్తున్న వైఎస్సార్‌సీపీ 28వ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు

బీచ్ రోడ్డు: డ్రైనేజీ, తాగునీరు, తదితర సమస్యలను జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ 28వ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు అన్నారు. గురువారం ఆయన వార్డులోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వీలైనంత వేగంగా సమస్యలు పరిష్కరించేలా అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు



బాలుడి నడుము కింది భాగంలో కుక్కకాటు



గాయపడిన బాలుడు

అగనంపూడి: సైకిల్ తొక్కుకుని వెళ్తున్న ఆరేళ్ల బాలుడు హరను ఐదు కుక్కలు వెంబడించి గాయపరిచిన ఘటన 86వ వార్డు రాజీవ్‌నగర్ ఫేజ్–1లో జరిగింది. ఈ ఘటనలో బాలుడి పిరుదుల భాగంపై గాయాలయ్యాయి. దీంతో వెంటనే బాలుడిని అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తరలించి, యాంటీర్యాబిస్ వ్యాక్సిన్ వేయించారు. బాలుడి తండ్రి కోటేశ్వరరావు మాట్లాడుతూ కొన్ని నెలలుగా కాలనీలో పదుల సంఖ్యలో కుక్కలు తిరుగుతున్నాయని, కొత్తవారిపై, పిల్లలపై దాడులు చేస్తున్నాయని తెలిపారు. రెండున్నర నెలల క్రితం అపార్ట్‌మెంట్ వాచ్‌మన్ కుమారుడి చెవి దగ్గర కరిచాయని స్థానికులు తెలియజేశారు. జీవీఎంసీ కమిషనర్ స్పందించి కుక్కల ఏరివేత చేపట్టాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

ఫ్యూజ్ బాక్స్‌కు తలుపుల ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ బాక్స్‌కు ఏర్పాటు చేసిన తలుపులు

సాక్షి ఎఫెక్ట్..

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డు పక్కన పెదగదిలి కూడలి వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ బాక్స్‌కు విద్యుత్ విభాగం అధికారులు గురువారం తలుపులు ఏర్పాటు చేశారు. ఇక్కడ ఈ నెల 19న వర్షం కురుస్తున్న సమయంలో విద్యుత్ తీగలు తగిలి ఓ పాడి ఆవు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. దీనిపై ఈ నెల 22న ‘ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్’ అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి ఫ్యూజ్ బాక్స్‌కు తలుపులు వేసినట్టు ఆరిలోవ విద్యుత్ విభాగం ఏఈ హేమ తెలిపారు. ఇక్కడ ట్రాన్స్‌ఫార్మర్ పక్కన కిందన వేలాడుతున్న కేబుల్ లైన్ తమ విభాగానికి సంబంధించినది కాదన్నారు. అది జీవీఎంసీకి చెందిన వీధి దీపాల నిర్వహణ విభాగానికి చెందినదని ఆమె స్పష్టం చేశారు. ఆ కేబుల్ వైర్లను కూడా జీవీఎంసీ విభాగం సరిచేసినట్లు తెలిపారు.

చిల్డ్రన్స్ ఎరీనాలో బాలల చిత్రాల ప్రదర్శనకు వినతి



వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్‌కు వినతి పత్రం అందిస్తున్న నరవ ప్రకాశరావు

బీచ్ రోడ్డు: నగరంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో బాలల చిత్రాలు ప్రదర్శించాలని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు కోరారు. ఈ మేరకు ఆయన గురువారం వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో కమిషనర్ విశ్వనాథన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరవ మాట్లాడుతూ ఈ బాలల థియేటర్‌లో గతంలో చిన్నారుల కార్యక్రమాలు, బాలల చిత్రాల ప్రదర్శనలతో నిత్యం కళకళలాడుతుండేదన్నారు. కొన్నేళ్లుగా బాలల కార్యక్రమాలను ఆపేసి, కేవలం ప్రైవేట్, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు పరిమితం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా చొరవ తీసుకుని పూర్తి స్థాయిలో బాలల కార్యక్రమాల నిర్వహణ, బాలల చిత్రాల ప్రదర్శనకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సహాయ కార్యదర్శి డాక్టర్ బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాభ్యాస్యం కిట్ల పంపిణీ



విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ కిరణ్ కుమార్ కృషి ఆర్థోపెడిక్ సొసైటీ ప్రతినిధులు

మద్దిలపాలెం: వెంకోజీపాలెంలోని జీవీఎంపీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సీతమ్మధారంలోని డాక్టర్ ఎస్‌వీఎస్ కిరణ్‌కుమార్ కృషి ఆర్థోపెడిక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం విద్యాభ్యాస్యం కిట్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు అవసరమైన పరీక్ష అట్టలు, పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, బ్యాగులతో కూడిన కిట్లను సొసైటీ అధ్యక్షుడు బి.ఎస్.సుబ్బారావు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఎస్.అనిత, కార్యదర్శి డి.నరేంద్ర, పాఠశాల హెచ్‌ఎం సిహెచ్.జ్యోతి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేడీపీఎం స్కూల్‌లో క్రీడా పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న హెచ్‌ఎం సుమతి భాయి, తదితరులు

ఎంవీపీ కాలనీ: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా పెదవాల్తేర్‌లోని కేడీపీఎం స్కూల్‌లో విద్యార్థులకు గురువారం క్రీడా పోటీలు నిర్వహించారు. స్కూల్ పీడీ యూఎస్ రత్నం ఆధ్వర్యంలో ఈ పోటీలు జరగగా విద్యార్థులు పలు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరిచారు. అనంతరం విజేతలకు హెచ్‌ఎం సుమతి భాయి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాలెం రైతుబజారును సందర్శించిన డీఎస్‌వో



రైతుబజారులో స్టాళ్లను పరిశీలిస్తున్న డీఎస్‌వో సూర్యప్రకాశ్

విశాఖ విద్య: మర్రిపాలెం రైతుబజారును గురువారం జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి సూర్యప్రకాశ్ సందర్శించారు. బజారులో ఏర్పాటు చేసిన కందిపప్పు, బియ్యం స్పెషల్ కౌంటర్‌లో విక్రయాలను అడిగి తెలుసుకున్నారు. బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరకుల ధరలు పెరుగుతున్నందున, వినియోగదారుల సౌలభ్యం జిల్లాలోని అన్ని రైతుబజార్లలో స్పెషల్ కౌంటర్‌లు ఏర్పాటు చేశామన్నారు. వీటిని వినియోగదారులు సద్వినియోగం చేసుకునేలా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.181 ఉంటే, రైతుబజారులో రూ.160కే అందిస్తున్నట్లు చెప్పారు. రోజు వారీ అమ్మకాలు, స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. డీఎస్‌వో వెంట సర్కిల్–2 ఏఎస్‌వో, ఆర్ఐ కోమలి, రైతుబజారు ఈవో కొమ్మనాపల్లి వరహాలు, సహాయకుడు ప్రతాప్ తదితరులు ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం



కంచరపాలెం రైతుబజారు వద్ద నిరసనలో మాట్లాడుతున్న బొట్టా ఈశ్వరమ్మ

కంచరపాలెం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ సీపీఎం కంచరపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. కంచరపాలెం బీఎస్‌ఆర్ భవన నుంచి దేవేంద్రనగర్, రెడ్డి కంచరపాలెం, దుర్గానగర్, జాషువానగర్ ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించి కంచరపాలెం రైతుబజారు వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా జోన్ కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ మాట్లాడుతూ ఈ బడ్జెట్‌లో కార్పొరేట్ సంస్థలకు వరాలు, సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారాలు మోపేలా కేటాయింపులు ఉన్నాయన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఆర్థిక సహకారం అందిస్తారని కార్మికులు వేయి కళ్లతో ఎదురు చూస్తే.. ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి అభివృద్ధికి రూ.15,000 కోట్లు కేటాయించడం అబద్ధమని, అప్పు తెచ్చుకోవడానికి హామీగా ఉంటామని మాత్రమే చెప్పారన్నారు. ప్రభుత్వం, పచ్చ మీడియాలు వాస్తవాలు చెప్పకుండా ప్రజలను పక్కదారి పట్టిస్తున్నాయని ఆరోపించారు. ఏపీకి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి కావడానికి కావలసిన నిధుల గురించి, విశాఖ కేంద్రంగా రైల్వే జోన్, ఉత్తరాంధ్రకు ప్రత్యేక నిధులు కేటాయించలేదని తెలిపారు. ఈ బడ్జెట్‌ను సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ జోన్ నాయకులు ఒమ్మి అప్పారావు, ఎం.ఈశ్వరరావు, బి.ఎస్.చలం, బి.అప్పారావు, శంకరరావు, కుమారి పాల్గొన్నారు.